# లాకప్పులో టోసిప్పు!

కథ

రాంపా

''ఇదేంటండీ బాబో! పిచ్చికుక్క వుంది జాగ్రత్త అని రాశారు. కుక్కెక్క డుందో'' లోపలికెప్పుడొచ్చాడో తెలియకుండా అడిగాడు కుక్కుటేశ్వరం.

''వెరైటీగా భయపెడదామని... ఎవరో పిచ్చోడు కుక్కని ఎత్తుకెళ్లాడండీ'' చెప్పాడు మృగశిరం.

''మరాబోర్డలాగే వుంచారేం''

''మీలాంటి వాళ్ల కోసం''

''నేనేం చేసుకుంటానండీ''

''చెక్కభజన''

''సర్లెండి, ఇది సొంతిల్లా''

''కాదండీ వేరే వాళ్ల సొంతిల్లు''

''మీ అగ్గిపుల్ల విరుపు మాటలు నాకెందుకు లెండి'' అంటూ చెప్పులో కాలుపెట్టాడు కుక్కుటం. వచ్చిన పని అయినట్లుగా.

''ఏవండోయ్, అవి నా చెప్పులు నిన్ననే కొన్నాను'' అన్నాడు మృగశిరం.

''నావీ ఇలాంటివేనే. ఇక్కడే విడిచానే'' ఆశ్చర్యం నటించాడు కుక్కుటం.

''మీరు చెప్పులే వేసుకు రాలేదు.'' కిటికీలోంచి చూస్తూ అన్నాడు మృగశిరం కొడుకు నాదానందం.

''చూసినట్లే చెపుతున్నావే'' అన్నాడు కుక్కుటం తడబాటుని కనపడనీయకుండా.

''అసలు నేను చూసింది. మీ పాత చెప్పులు చెత్త కుండీలో వేస్తూ మీరు రావడం'' చెప్పాడు నాదానందం.

''మతిమరుపండీ, ఛస్తున్నాను'' అంటూ వెళ్లబోయాడు కుక్కుటం.

''ఇంతకీ మీరెందుకొచ్చారో చెప్పకుండానే వెళుతున్నారేం'' అన్నాడు మృగశిరం.


''చెప్పులకోసమే'' అన్నాడు నాదానందం.

''కాదు బాబో చెప్పులప్పుకోసం''

''అదేం అప్పు''

''ఏ వ్యాపారం కలిసొచ్చేట్లు లేదు. చెప్పుల కొట్టు పెట్టి చూద్దామనుకుంటున్నాను. మీరు కాస్త అప్పిస్తారేమోనని'' దీనంగా అన్నాడు కుక్కుటం.

''చెప్పుల కోసం అప్పెందుకు చెప్పండి. చెప్పులు లేకుండా వెళుతూ చెప్పులతో తిరిగొస్తూ రోజుకో జత అమ్ముకున్నా మీకొచ్చేది మీకొస్తుందిగా. చేతికి దొరికింది నొక్కటం. నోటికి దొరికింది మెక్కడమేగా మీరు చేసే పని కుక్కుటం గారూ'' అన్నాడు నాదానందం.




''ఏంట్రా అంకుల్ని నిలదీస్తున్నావు?''

''నువ్వే చూడు నాన్నా! ఈయనగారి జేబులో మన రిస్టువాచ్‌లు రెండు, మన టీవీ రిమోట్, నెయిల్‌కట్టర్, ఆ జేబులో ఆస్ట్రేలియా నుంచి తెచ్చిన యాష్ ట్రే, అవి నేను చూసినవి. చూడనివి ఇంకేం వున్నాయో చూడాలి'' చెప్పాడు నాదానందం.

''అదేవిటండీ పిల్లవాడేదో అంటున్నాడు'' అడిగాడు మృగశిరం.

''ఆc! పిల్లకేకలు లెండి. నేనేమనుకోను. వెళ్లొస్తా'' వెళ్లబోయాడు కుక్కుటం.

కుక్క భౌ అంది!

''అమ్మో, పిచ్చోడు కుక్కని వదిలిపెట్టుంటాడు'' అని కేకపెట్టి గడప కొట్టుకొని కిందపడ్డాడు కుక్కుటం. ఆ హడావిడిలో జేబుల్లో వస్తువులు బయటికొచ్చాయి.

''అరే! ఇవన్నీ మావేనే!'' అన్నాడు మృగశిరం.

''మీవైతే మీవే అనుకోండి. కానీ కుక్కలేదని అబద్ధం ఎందుకు చెప్పారో చెప్పండి'' ఆయాసపడుతూ అన్నాడు కుక్కుటం.

''నిజంగానే లేదండీ'' చెప్పాడు మృగశిరం.

''మరి ఆ 'భౌ'?''

''మావాడి మిమిక్రీ లెండి''

''పేరుకే మీ నాన్న మృగశిరం. జంతునాదాలు మాత్రం నువ్వు చేస్తున్నావు''

''మా నాన్నగారి పేరునేం అనకండి. మా తాత గారు నరసింహస్వామి భక్తుడు. కాబట్టి ఆ పేరు పెట్టుకున్నాడు.''

''మరి నీ పేరేంటి తండ్రీ'' విషయాన్ని పక్కదారి పట్టించానన్న ఆనందంతో అన్నాడు కుక్కుటం.

''మహిష మేష శునక వారాహ గార్దభ మార్జాల హస్తి భల్లూక నాదానందం''

''ముద్దుపేరు లేదా కన్నా''

''నేరెళ్ల వేణు మాధవ మిమిక్రీ శ్రీనివాస్''

''నేను అడగడంలో ఏదో పొరపాటయింది. నిన్నేమని పిలవాలో, ఎలా పిలిస్తే పలుకుతావో ఒక్కముక్కలో చెప్పు బాబు''

''నాదానందం''

''ఇప్పుడే వెళ్లి హరిహర కళాభవన్లో నీ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తా'' అంటూ పరిగెత్తాడు కుక్కుటం.

***

''ఉన్న బరువులు చాలవన్నట్లు భారమైన వ్యక్తుల్ని కూడా భుజం మీద వేసుకుని తిరుగుతానంటే ఎట్లా అండీ'' అడిగింది మృగశిరం భార్య శిరోమణి. కుక్కుటం కొట్టు పెట్టుకోవడానికి మృగశిరం అప్పు ఏర్పాటు చేశాడన్న విషయం తెలుసుకొని –

''నీవు కూడా ఏదన్నా వెయిట్ లిఫ్టింగ్ చేద్దామనుకుంటున్నావా'' అన్నాడు మృగశిరం.

''చాల్లెండి, వంటి బరువెక్కువై టాంక్ బండ్ మీద అటూ ఇటూ తిరగలేక అవస్థపడుతున్నాను'' అంది శిరోమణి.

''నా ఉద్దేశం ఏ నగోనట్రో అని'' భార్యని బంగారం ముచ్చట్లలో పడేశాడు.

''అక్షయ తృతీయ నాడు అడక్కడక్క గొలుసడిగితే ప్రసాద్ ఐమాక్స్‌లో గోల్డెన్ టాటూలు వళ్లంతా పెట్టిస్తానన్నారుగా, అవి చాల్లెండి'' అంది.

''అడిగావు కాబట్టి అప్పుడది, అడగలేదు కాబట్టి ఇప్పుడిది. సిసలైన బంగారు కడియాలు నీ ఇష్టం'' అన్నాడు.

''వద్దులెండి. వడియాలు కొనుక్కురండి చాలు'' అంటూ కిటికీ వెలుతురుకి ఏదో మేఘం అడ్డొచ్చినట్లనిపిస్తే అటు చూసింది.

''కొనుక్కురావడమేంటే శిరోమణి! లాల్‌బహద్దూర్ స్టేడియం నిండా వడియాలు పెట్టుకుని రమ్మంటావా చెప్పు'' అంటూ వచ్చింది ఓ ఆవిడ దర్వాజాలోంచి ఎలా దూరి వచ్చిందా అనిపించేంత లావుతో, మొహమంత బొట్టుతో.

''ఎవరమ్మా మీరు? మిమ్మల్నెప్పుడూ చూడలేదే'' అడిగింది శిరోమణి.

''అంతే అనిపిస్తుందే! చిన్నప్పుడు మీ అమ్మా నేను ఇల్లు మరిచి ముగ్గులు పెట్టేవాళ్లం'' అందావిడ అత్యంత ఆప్యాయంగా.

''మీ పేరు?''

''అదేంటే, చింతమ్మ పిన్నిని'' చెప్పిందావిడ.

''అంటే ఏంటో'' అయోమయంగా అడిగాడు మృగశిరం.

''అవునవును...సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి పిన్ని''

''చూశారా, అల్లుడుగారూ నా పూర్తిపేరు చెప్పిందంటే నేను పూర్తిగా గుర్తుకొచ్చినట్లేగా''

''వచ్చినట్లే'' అనలేక అన్నాడు మృగశిరం.

''ఊరంతా నీదేగా ఎలా వొదిలొచ్చావు పిన్నీ'' అడిగింది శిరోమణి.

''ఏం చేయనే తల్లీ, తుపాకులు పట్టుకు తిరిగేవాళ్లు బెదిరిస్తే గ్రేటర్ హైద్రాబాద్‌లో వడియాలు పెట్టుకునైనా బతకొచ్చని వచ్చా. నాకొచ్చిన పనదీ'' ఇంటి కొలతలు కంటితోనే లెక్కపెడుతూ అంది చింతమ్మ పిన్ని.

శిరోమణిని ఏదో సాకుతో లోపలకి పిలిచాడు మృగశిరం.

''ఈమె వాలకం చూస్తే మన భవిష్యత్తు భయానకంగా గోచరిస్తున్నది'' అన్నాడు.

''మీరూరుకోండి. పెద్ద చెప్పొచ్చారు. ఈ వంకతో రెండు డబ్బాలు వడియాలు పెట్టుకోవచ్చు'' అంది శిరోమణి మొగుడి నెత్తిమీద మెత్తగా మొట్టికాయ మొత్తుతూ.

''సరే మరి, మంచి గుమ్మడికాయలు తెమ్మంటారా'' బయటికొచ్చి అడిగాడు మృగశిరం.

''మంచి కాదు బూడిద'' అందావిడ.

''నా మంచి బూడిదే లెండి'' అన్నాడు మృగశిరం.

''అయినా మీరెందుకు అల్లుడుగారూ నేను తెస్తాగా''

''తెస్తారో, మోండా మార్కెట్ నుంచి మా ఇంటి మీద పడేట్లు విసిరేస్తారో'' గొణిగాడు మృగశిరం.

***

''ఏమండీ, ఖర్చుపెరగడం మాట అటుంచి నిన్న మొన్నటి దాకా చిన్న వస్తువులు పోయాయి. ఇప్పుడు టీవీలు, ఫ్రిజ్‌లు కూడా మిగిలేట్లు లేవు'' విలవిల్లాడింది శిరోమణి.

''పోవడమేంటి? రావడమేంటి? నా విషయమేనా'' అంటూ వచ్చింది చింతమ్మ పిన్ని.

''అవునే చింతమ్మ పిన్ని, ఫిలింఫెస్టివల్ అంటూ వెళ్లావు. ఇంకా రాలేదేంటి అని'' అంది శిరోమణి.

''వెళ్లిన వేళ మంచిదైంది. అక్కడో పోలీసు భార్య నన్ను చూసి మెచ్చుకొని వాళ్లింట్లో వుండమని ఆహ్వానించింది. మీ సలహా తీసుకుందామని వచ్చాను'' అంది చింతమ్మ పిన్ని.

''మీకదే సరైంది. పెద్ద ప్రమోషన్ వచ్చినట్లనుకోండి'' అన్నాడు మృగశిరం. అవకాశాన్ని వినియోగించుకుంటూ...

***

''హెల్మెట్ లేకుండా పట్టుబడి పోలీసులకి మోటార్ సైకిలిచ్చి వెళుతుంటే చూశా'' అన్నాడు నాదానందం.

''ఎవర్నిరా'' అడిగాడు మృగశిరం.

''కుక్కుటం అంకుల్ని''

''ఎవరి బండో ఏమిటో'' అంది శిరోమణి.

''నాదేనమ్మా, పోలీసులకి కాయితాలు చూపించి బండి తెచ్చుకున్నాను.''

''నాన్నేదన్నా అందామంటే 'చింతమ్మ పిన్నీ' అని నోరు నొక్కేట్లు చేసుకున్నా'' అంది శిరోమణి.

''కుక్కుటం అంకుల్ పక్కన మీ చింతమ్మ పిన్నుందేవిటే'' అన్నాడు నాదానందం.

''పెళ్లిబట్టలు నలగక ముందే దేశాలు పట్టుకు పోయాడన్నారు. ఎప్పుడు తిరిగొచ్చాడో ఏంటో, దొందూ దొందేనన్నమాట'' అంది శిరోమణి.

***

''కస్టడీలో కాపలా పోలీసుల నోట్లో వడియాలు పెట్టి తప్పించుకు పోయిన జంట'' పేపరు చదివి పక్కన బెట్టి ''చూశావా మీ పిన్నీ బాబాయిల పేర్లు పేపర్లోవచ్చాయి'' అన్నాడు మృగశిరం.

''అసలు జైలుపాలెందుకయ్యారో'' అంది శిరోమణి.

''పోలీసాఫీసరింట్లో బులెట్ బెల్ట్ మాయం చేశారట'' చెప్పాడు మృగశిరం.

''ఇప్పుడెక్కడ ఏం చేస్తున్నారో'' అని శిరోమణి అంటుంటే పోలీసుజీపొచ్చి ఇంటి ముందాగింది.

కుక్కుటం, చింతపిన్ని వెనక పోలీసులు:

***

''ఏదో పోలీసాఫీసరు నా క్లాస్‌మేట్ కాబట్టి టీపార్టీ చేసి పంపించాడు'' వచ్చి మంచం మీద నడుం వాలుస్తూ అన్నాడు మృగశిరం.

''అంత కేసెందుకయిందో, ఆ బెల్టుకి బుల్లెట్లున్నాయటా'' అడిగింది శిరోమణి.

''లేవు. అందుకే బయటపడేయించగలిగా'' అన్నాడు మృగశిరం.

''అదెందుకు కావల్సి వచ్చిందో'' అడిగింది శిరోమణి.

''నడుం నొప్పి బెల్టుని చెప్పి గొలుసులు, నెక్లెసులు ఎన్నైయినా అవలీలగా దాచిపెట్టవచ్చని నిజం చెప్పిందట మీ చింతమ్మ పిన్ని'' అన్నాడు.

''ఇంతకీ పోలీసు దెబ్బలు తిన్నట్టేనంటారా?'' అడిగింది శిరోమణి.

''తినబట్టే మారి మంచి వాళ్లయి గిఫ్ట్స్ అండ్ నావెల్టీస్ షాపు పెట్టుకున్నారు'' చెప్పాడు మృగశిరం.

''పెట్టుబడెవరిచ్చారో'' అంది శిరోమణి.

''ఏదో మనపెళ్లప్పుడు పెట్రోమాక్స్‌లైటు పట్టుకున్నాడటోయ్'' అందుకని జాలిపడి అప్పిప్పిచ్చానని చెప్పకుండా చెప్పాడు మృగశిరం.

''ఆc!!'' అని కుప్పకూలింది శిరోమణి.

''అక్షయ తృతీయ నాడు అడక్కడక్క గొలుసడిగితే ప్రసాద్ ఐమాక్స్‌లో గోల్డెన్ టాటూలు వళ్లంతా పెట్టిస్తానన్నారుగా, అవి చాల్లెండి'' అంది.